రెవెన్యూ సదస్సులో ప్రొటోకాల్ ఉల్లంఘన

అరవ శ్రీధర్ పేరుకే ఎమ్మెల్యే..
పెత్తనమంతా ముక్కా కుటుంబానిదే


పుల్లంపేట మండలం ఎస్ఆర్ పాలెం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ముక్కా వికాస్‌రెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యుల పాలన సాగుతోంది. ఎంతలా అంటే ఎటువంటి స్థాయిలేని టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి కుమారుడు ముక్కా సాయివికాస్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించే అధికారిక రెవెన్యూ సదస్సులలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రెవెన్యూ, ప్రత్యేక అధికారులతో కలసి స్టేజీపై కూర్చొని ప్రొటోకాల్ ఉల్లంఘించడమే కాక రైతుల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారం చేస్తామని హామీలు ఇచ్చేంతవరకు వచ్చింది. మంగళవారం పుల్లంపేట మండలం వైఎస్సార్ పాలెం పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ హాజరయ్యారు. వేదికపై రెవెన్యూ అధికారులు రైతులు అర్జీలు స్వీకరించాల్సి ఉంది. అయితే ముక్కా వికాస్‌రెడ్డి వేదికపై కూర్చొని రైతుల అర్జీలు స్వీకరిస్తుడటం చర్చకు దారితీసింది. ఎమ్మెల్యేను కాదని వికాస్‌రెడ్డి అర్జీలు స్వీకరిస్తుండటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ఎమ్మెల్యే చేయాల్సిన పనిని టీడీపీ ఇన్‌చార్జ్ కుమారుడు చేస్తుండటంతో అర్జీదారులు అవాక్కవుతున్నారు. మన ఎమ్మెల్యే సంతకాల వరకే అధికారం, వ్యవహారం అంతా తామేనని రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్న తీరు స్పష్టం చేస్తోంది. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేకు ఇలాంటి పరిస్థితి తామెప్పుడూ చూడలేదని చెప్పుకోవడం కనిపించింది.

క్లుప్తంగా..

క్రికెట్ టోర్నీ ప్రారంభం

పెనగలూరు : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం పెనగలూరు హైస్కూల్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సుండుపల్లె : ఏటిగడ్డ రాచపల్లి సమీపంలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి తిమ్మసముద్రం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీజీకే రామచంద్ర రాజు (గోపాల్) రూ.1,00,116లు నగదును ఓం ఛారిటబుల్ ఫౌండేషన్ సభ్యులకు మంగళవారం అందజేశారు.

దేవదాయ భూముల ఆక్రమణలపై చర్యలు

గాలివీడు : దేవాలయాలకు సంబంధించిన భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలోని ఎగువ గొట్టివీడు పంచాయతీలో తహసీల్దార్ భాగ్యలత ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై, దేవాలయ భూముల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రాయచోటి అర్బన్ : పలు ప్రభుత్వ పథకాల అమలులో వెట్టిచాకిరి చేస్తున్న స్కీం కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, ఉపాధ్యక్షుడు మంగళవారం పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. అనంతరం అంగన్‌వాడీ, ఆశలతో కలసి కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

సంబేపల్లె : ఎస్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి అధ్యాయన సామగ్రిని విద్యార్థులకు మంగళవారం అందజేశారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువున్న విద్యార్థులకు ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు మెటీరియల్ అందజేశారు.

ఇందిరమ్మ కాలనీలో వసతులు కల్పించండి

రాయచోటి అర్బన్ : మున్సిపాలిటీలోని 30వ వార్డు పరిధిలో ఉన్న తమ కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని ఇందిరమ్మ కాలనీ ప్రజలు కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏరియా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని వెంటనే అధికారులు వసతులు కల్పించాలంటూ డిమాండ్ చేశారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

సిద్దవటం : మాధవరం–1 పంచాయతీలోని రామక్రిష్ణపురం, వెంకటేశ్వరపురం గ్రామాలకు చెందిన మహిళలు తాగునీటి కోసం మంగళవారం గ్రామ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 10 రోజులుగా నీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఉదయం 10 గంటలైనా సచివాలయం తెరుచుకోకపోవడంతో మహిళలు సచివాలయ ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

వేధింపులు ఆపాలి

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని ఐసీడీఎస్ కార్యకర్తలు, ఆయాలపై అధికారుల వేధింపులు ఆపాలని మంగళవారం సీఐటీయూ నేత సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. మాట్లాడుతూ అంగన్‌వాడీలను స్థానిక అధికారి దుర్భాషలాడటం, బెదిరించడమే కాక మెమోలు ఇస్తుండటం దారుణమన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుడ్ నైబర్స్ ఇండియా సేవలు అభినందనీయం


ప్రారంభోత్సవ పూజల్లో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు, అధికారులు

సుండుపల్లి : సమాజ శ్రేయస్సే లక్ష్యంగా గుడ్ నైబర్స్ ఇండియా సంస్థ కృషి చేయడం అభినందనీయమని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి అన్నారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం దిగువ హరిజనవాడలో ఆ సంస్థ అధ్వర్యంలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ హెడ్ ట్యాంక్‌తోపాటు బోరు ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్యం.. రాజంపేటలోనే లభ్యం

రాజంపేట : రాజంపేటలో ఇప్పుడు అన్ని రకాల జబ్బులకు నయం చేసే విధంగా ఆసుపత్రులు వెలిశాయి. నిపుణులైన వైద్యులు వచ్చేశారు. తిరుపతి, కర్నూలు, చెన్నై, హైదరాబాదు, బెంగళూరు, వేలూరు తదితర ప్రాంతాలకు మెరుగైన వైద్యం కోసం పరుగులు తీయాల్సిన అవసరంలేదు. అవునండి నిజం.. ఇప్పుడు అత్యాధునిక వైద్యం రాజంపేట వాసుల చెంతనే ఉంది. దూరపు కొండలు నునుపు అనేది తెలుసుకోండి. జేబులకు చిల్లు.. లక్షలాది రూపాయలు వ్యయం చేసుకోవడం తప్ప మరొకటి ఉండదు. ఇప్పుడు రాజంపేటలో వైద్యానికి పెద్దపీట వేశారు. అన్ని రకాల జబ్బులకు స్పెషలిస్టులు ఇప్పుడు అందుబాటులో ఉన్నారు. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా మానవ సేవే మాధవ సేవ అన్న రీతిలో వైద్యులు తాము ఎంచుకున్న విభాగంలో స్పెషలైజేషన్‌లో ముందుకువెళుతూ రాజంపేటతోపాటు పరిసర ప్రాంత ప్రజలు ఆరోగ్యానికి విశేషంగా కృషి చేస్తున్నారు.

మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి



మనిషి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలి. అప్పుడే దేనినైనా సాధించగలరు. మధుమేహం ఉన్న వారు జాగ్రత్తలు పాటిస్తూ ఆహార నియమాలను అనుసరించాలి. తరుచుగా షుగర్ గురించి తెలుపుకుంటూ ఎప్పటికప్పుడు వైద్యం తీసుకోవాలి. నిర్లక్ష్యం చేసే మూల్యం చెల్లించక తప్పదు.

– డా.మునిబాలకృష్ణ, ప్రముఖ షుగర్ వైద్య నిపుణులు, రాజంపేట

శారీరక వ్యాయామం తప్పనిసరి



ప్రతి ఒక్కరికి శారీరక వ్యాయామం తప్పనసరి. మంచి ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. చిన్నపిలల విషయంలో తల్లిదండ్రులు ఆరోగ్యపరంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అలాగే వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్య, వైద్యం రెండింటిని పరిరక్షించే విధంగా ముందుకెళ్లాలి. చలి కాలం చిన్నారులకు సీజనల్ వ్యాధులు వస్తుంటాయి. తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించి పిల్లల ఆరోగ్యానికి కృషి చేయాలి.

– డా.వీరయ్య, ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, రాజంపేట

ఆర్థో రోగులకు అత్యాధునిక సేవలు



మా ఆసుపత్రిలో ఆర్థోకు సంబంధించి అత్యాధునిక సేవలందించడమే కాక సర్జరీలు చేస్తున్నాం. ఆర్థో పరంగా ఆధునిక వైద్యం విషయంలో తాము ముందంజలో ఉన్నాం. ఇప్పటి వరకు రాజంపేట పట్టణవాసుల సహకారంతో ఆర్థోపీడిక్ సమస్యలతో బాధపడుతున్న రోగులకు విస్తృతంగా సేవలందించేందుకు కృషి చేస్తున్నాం.

– డా.జగన్‌మోహన్, ప్రముఖ ఆర్థో నిపుణులు, రాజంపేట

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి. తల్లీబిడ్డ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. నేటి సమాజంలో ఆడపిల్లల నిష్పత్తిలో పెరుగుదల ఉండాలి. భావన క్లినిక్‌లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా సౌకర్యాలు అందిస్తున్నాం. వ్యాపారపరంగా కాకుండా సేవా దృక్పథంతో ముందుకెళుతున్నాం.

– డా.కామేశ్వరి, ప్రముఖ గైనాకలజిస్టు, రాజంపేట

వైద్యుడు సమాజ సేవకుడు



వైద్యుడు నిరంతర సమాజ సేవకుడు. వైద్యరంగంలో వస్తున్న నూతన మార్పుల అనుగుణంగా వైద్యసేవలు ఇప్పుడు రాజంపేటలో అందుబాటులో ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల జబ్బులకు నయం చేసే విధంగా ప్రత్యేక స్పెషలిస్టులు ఉన్నారు. ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి తన హాస్పిటల్‌లో ప్రత్యేక చికిత్సలు రోగులకు అందిస్తున్నాం.

– డా.బాలరాజు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు(ఎలెక్టడ్), రాజంపేట

నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలి


మాట్లాడుతున్న పసుపులేటి శంకర్

రాజంపేట టౌన్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల ప్రతిభా పాటవాల తోపాటు భాషా పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనావుందని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ తెలిపారు. స్థానిక వైష్ణవి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఈశ్వరయ్యనాయుడు అధ్యక్షతన జాతీయ సమైఖ్యత, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం తదితర విషయాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. పసుపులేటి శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని అలవరుచుకోవాలని సూచించారు. టీనేజీలో ఏ నిర్ణయం తీసుకున్న ఆచితూచి నిర్ణయం తీసుకొని ముందుకు సాగాలన్నారు. అలానే కష్టపడి చదివితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు.

జాతీయ స్థాయి కురాష్ పోటీల్లో విద్యార్థి


విద్యార్థి శశాంక్‌ను అభినందించిన స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శులు

సిద్దవటం : 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కురాస్ పోటీల్లో శ్రీ నలంద విద్యార్థి విజయం సాధించారని పాఠశాల ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ జనవరి 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి కురాష్ పోటీల్లో అండర్ – 17 విభాగంలో 10వ తరగతికి చెందిన బాలుగారి శశాంక్ మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాడన్నారు.

రాజకీయాల్లో నైతిక విలువలు ఉండాలి


రమేష్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న కార్యకర్తలు

లక్కిరెడ్డిపల్లి : ప్రజాస్వామ్యంలో తాను విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ కార్యకర్తలకు అన్ని వేళలా అండగా నిలిచానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలంలోని తన స్వగృహంలో మంగళవారం గాలివీటి నాగేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి రమేష్ కుమార్ రెడ్డిని దుశ్శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తాము అధికారంలో ఉన్నా లేకపోయినా నమ్ముకున్న కార్యకర్తలకు వారి కష్టనష్టాలలో పాలుపంచుకుంటానని రమేష్ కుమార్ రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

రైతు సంఘం మహాసభను జయప్రదం చేయండి

చిట్వేలి : రాయచోటిలో బుధవారం(నేడు) జరుగుతున్న రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని రైల్వేకోడూరు సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, రైతు నాయకులు తిప్పన ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం చిట్వేలిలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో శివ, సుబ్బరాయుడు, దేవి, వెంకటసుబ్బమ్మ, వెంకటరమణలు పాల్గొన్నారు.

మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన

రాయచోటి అర్బన్ : అభివృద్ధి అంశంలో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిన ప్రధాని నరేంద్రమోదీ గోబ్యాక్ అంటూ సీపీఎం కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక బస్టాండు సర్కిల్‌లోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు మాట్లాడుతూ విభజన హామీల అమలు విస్మరించారన్నారు. రాయలసీమకు ప్రత్యేక నిధుల కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును కార్పొరేట్‌లకు తెగనమ్మేందుకు ప్రయత్నిస్తుండటం దుర్మార్గమని అభివర్ణించారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.